నేడు బీఆర్ఎస్ఎల్పీ భేటీ

అసెంబ్లీలో అనుసరించాల్సిన వ్యూహంపై కేసీఆర్ దిశానిర్దేశం

హైదరాబాద్, డిసెంబర్ 7 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల సంయుక్త సమావేశం పార్టీ అధినేత కే చంద్రశేఖర్‌రావు అధ్యక్షతన ఆదివారం జరగనున్నది. సోమవారం నుంచి ప్రారంభమయ్యే అసెంబ్లీ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహంపై కేసీఆర్ ప్రజాప్రతినిధులకు దిశానిర్దేశం చేయనున్నారు. ఎర్రవెల్లిలోని కేసీఆర్ నివాసంలో ఈ సమావేశం నిర్వహించనున్నారు. ఏడాదిగా కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న ప్రజావ్యతిరేక విధానాలు, ఆయా వర్గాల ప్రజలు పడుతున్న ఇబ్బందులను అసెంబ్లీ వేదికగా ఎత్తిచూపేందుకు అనుసరించాల్సిన వ్యూహంపై కేసీఆర్ దిశానిర్దేశం చేయనున్నారు. హైడ్రా, లగచర్ల ఉదంతాలతో దేశవ్యాప్తంగా తెలంగాణ ప్రతిష్ఠ ఏ విధంగా మసకబారుతున్నది? కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలపై ప్రజల ఎదురుచూపు, నిరసన వంటి అంశాలను సభ దృష్టికి తేవడానికి ఏయే చర్యలు తీసుకోవాలి? వంటి అంశాలపై కేసీఆర్ మార్గనిర్దేశం చేసే అవకాశాలు ఉన్నాయని తెలుస్తున్నది.

రెండు రోజుల కస్టడీకి మాజీ ఎమ్మెల్యే పట్నం

వికారాబాద్, డిసెంబర్ 7 : వికారాబాద్ జిల్లా చర్లపల్లి జైలులో ఉన్న కొడంగల్ మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డిని పోలీస్ కస్టడీకి తీసుకున్నారు. శనివారం ఆయన్ను జైలు నుంచి వికారాబాద్ డీటీసీ సెంటర్‌కు తీసుకొచ్చారు. రెండు రోజులపాటు పోలీస్ కస్టడీలో పట్నం నరేందర్‌రెడ్డిని న్యాయవాది సమక్షంలో విచారించనున్నారు. అనంతరం సోమవారం ఉదయం 10 గంటలకు కోర్టులో నరేందర్‌రెడ్డిని హాజరుపరుస్తారని ఆయన తరపు న్యాయవాది జుక్కల్ల లక్ష్మణ్ తెలిపారు.

కౌశిక్‌రెడ్డిపై మరో కేసు

గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌లో నమోదు

శేరిలింగంపల్లి, డిసెంబర్ 7: బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి పై మరో కేసు నమోదైంది. మాసబ్ ట్యాంక్ ఇన్‌స్పెక్టర్ పరశురాం పట్ల దురుసుగా ప్రవర్తించడంతోపాటు విధులకు ఆటంకం కలిగించారని, చనిపోతానని బెదరించారన్న ఆరోపణలతో శనివారం గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. కోర్టు అనుమతితో బీఎన్ఎస్ 220, 226 సెక్షన్ల కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్టు ఇన్‌స్పెక్టర్ హబీబుల్లాఖాన్ తెలిపారు.

తెలంగాణభవన్‌లో లగచర్ల ఫార్మా బాధితులతో సమావేశమైన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు సత్యవతిరాథోడ్, రాజయ్య

రద్దయ్యే దాకా రణం

మొదటిపేజీ తరువాయి...

పేరుతో పోలీసు వేధింపులను నిలిపివేయాలని కోరారు. లగచర్ల రైతు బాధితులను ఢిల్లీ వరకు తీసుకెళ్లామని, వారికి అండగా నిలిచామని , వారి డిమాండ్లను అసెంబ్లీ సమావేశాల్లో లేవనెత్తుతామని కేటీఆర్ తెలిపారు. భూముల కోసం న్యాయమైన పోరాటం చేస్తున్న బాధితులపై అక్రమ కేసులు పెట్టడం దారుణమని మండిపడ్డారు. గిరిజన, పేద రైతుల హక్కుల పరిరక్షణ కోసం తమ పార్టీ బాధితుల తరపున నిలబడుతుందని భరోసా ఇచ్చారు. గిరిజనుల భూములు గుంజుకోవడం రేవంత్ దుర్మార్గానికి నిదర్శనమని దుయ్యబట్టారు. జైల్లో ఉన్న మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి వంటి వారి తరపున, అక్రమంగా కేసులతో జైల్లో ఉన్న బాధితుల తరపున బీఆర్ఎస్ పార్టీ న్యాయ పోరాటం చేస్తున్న విషయాన్ని గుర్తుచేశారు.

'నమ్మి నానబోస్తే' లఘు చిత్రాన్ని విడుదల చేసిన కేటీఆర్

మానకొండూరు మాజీ ఎమ్మెల్యే, తెలంగాణ ధూంధాం వ్యవస్థాపకుడు రసమయి బాలకిషన్ ఆధ్వర్యంలో ఏడాది కాంగ్రెస్ పాలనపై రూపొందిన 'నమ్మి నానపోస్తే' లఘు చిత్రాన్ని శనివారం తెలంగాణభవన్‌లో కేటీఆర్ విడుదలచేసి పార్టీ నేతలతో కలిసి వీక్షించారు. 22 నిమిషాల నిడివి గల ఈ షార్ట్ ఫిల్మ్‌తోపాటు రసమయి పాడిన 'అంతా ఉత్తదే' పాటను కూడా ప్రదర్శించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. అధికార కాంగ్రెస్ పార్టీ కార్యాలయం గాంధీభవన్ వెలవెలబోతుంటే.. తెలంగాణ భవన్ నిత్యం ప్రజలతో కళకళలాడుతున్నదని పేర్కొన్నారు. బీఆర్ఎస్‌పై ప్రజలకు ఏమాత్రం అభిమానం తగ్గలేదని, ఏడాది పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల నుంచి ఎన్నడూలేనంత వ్యతిరేకతను ఎదుర్కొంటున్నదని చెప్పారు. రాష్ట్రంలో ఇప్పటికిప్పుడు ఎన్నికలు వస్తే బీఆర్ఎస్ పార్టీయే అధికారంలోకి వస్తుందని ఒక సర్వే వెల్లడించిందని వివరించారు. గత ఎన్నికల్లో కోల్పోయిందని అధికారం మాత్రమేనని, ప్రజల కోసం పోరాడే పార్టీ లక్షణం, ఉద్యమ యావ కాదని స్పష్టంచేశారు. తెలంగాణ ప్రజల కోసం, అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా అంతే నిబద్ధతతో పనిచేస్తామని చెప్పారు. కాంగ్రెస్ అడ్డగోలు హామీలను నమ్మి మోసపోయి గోసపడుతున్న తెలంగాణ సమాజం తీరును రసమయి కండ్లకు కట్టినట్టు షార్ట్‌ఫిల్మ్‌లో చూపించారని కేటీఆర్ కొనియాడారు. ఈ షార్ట్‌ఫిల్మ్ సూటిగా, సుత్తిలేకుండా తెలంగాణ యాసలో తీశారని ప్రశంసించారు. ప్రజలు ఎదుర్కొంటున్న బాధలను ఇది ప్రతిబింబించిందని పేర్కొన్నారు.

బీఆర్ఎస్ పోరాటాలకు మంచి స్పందన

వచ్చే ఏప్రిల్‌తో బీఆర్ఎస్ పార్టీ 25వ సంవత్సరంలోకి అడుగు పెడుతుందని కేటీఆర్ చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ఏడాది కాలంలో చేసిన అవినీతి, ప్రజలను పెడుతున్న ఇబ్బందులపై బీఆర్ఎస్ చేసిన పోరాటానికి, ఆందోళనలకు ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తున్నదని తెలిపారు. ఏడాది కాలంలో పార్టీ అనేక గడ్డు పరిస్థితులను చవిచూసిందని, వాటన్నింటినీ దాటుకొని తిరిగి బీఆర్ఎస్ బలంగా నిలబడిందని వివరించారు. సమాజంలోని ప్రతి వర్గాన్ని కాంగ్రెస్ మోసం చేసిందని విమర్శించారు. 420 హామీలు, ఆరు గ్యారెంటీలను అమలు చేయలేక రేవంత్‌రెడ్డి సర్కారు చేతులెత్తేసిందని మండిపడ్డారు. అసెంబ్లీ సమావేశాల్లో పెండింగ్ బిల్లులు చెల్లింపుపై మాట్లాడాలని మాజీ సర్పంచులు, తమ గురించి మాట్లాడాలని ఆశా వర్కర్లు తనను కోరారని వెల్లడించారు. ప్రజాక్షేత్రంలో, అసెంబ్లీలో ప్రజల సమస్యను లేవనెత్తుతామని, సర్కారు వైఫల్యాలను ఎండగడతామని స్పష్టంచేశారు.

9న మరో షార్ట్‌ఫిల్మ్: రసమయి

ఈ నెల 9న 'తల్లిగోస' అనే మరో షార్ట్‌ఫిల్మ్‌ను విడుదల చేయనున్నట్టు రసమయి బాలకిషన్ చెప్పారు. ఆర్‌బీ టీవీ ఆధ్వర్యంలో ఇలాంటి షార్ట్‌ఫిల్మ్‌లు నెలకొకటి చొప్పున తీసుకొస్తామని తెలిపారు. షార్ట్‌ఫిల్మ్‌లు, పాటల ద్వారా కాంగ్రెస్ పార్టీ ప్రజలను మోసం చేస్తున్న తీరును వివరిస్తామని తెలిపారు.

ఉద్యమస్ఫూర్తితో షార్ట్‌ఫిల్మ్: మధుసూదనాచారి

ఉద్యమస్ఫూర్తితో షార్ట్‌ఫిల్మ్ తీయడం గొప్ప విషయమని రసమయిని శాసనమండలిలో ప్రతిపక్ష నేత ఎస్ మధుసూదనాచారి ప్రశంసించారు. రేవంత్‌రెడ్డి సాగిస్తున్న దుర్మార్గ, రాక్షస పాలనను నాటి ఉద్యమ స్ఫూర్తితో ప్రశ్నిస్తామని చెప్పారు. ఆయా కార్యక్రమాల్లో మాజీ మంత్రులు మహమూద్ అలీ, సత్యవతి రాథోడ్, శ్రీనివాస్‌గౌడ్, తాటికొండ రాజయ్య, ఎమ్మెల్యేలు ముఠా గోపాల్, దుర్గం చిన్నయ్య, ఎమ్మెల్సీలు దేశపతి శ్రీనివాస్, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యేలు బాల్క సుమన్, మెతుకు ఆనంద్, చంటి క్రాంతికిరణ్, చిరుమర్తి లింగయ్య, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, సుంకె రవిశంకర్, పార్టీ ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, నాయకులు ఎర్రోళ్ల శ్రీనివాస్, దేవీప్రసాద్, డాక్టర్ చెరుకు సుధాకర్, తుల ఉమ తదితరులు పాల్గొన్నారు.

సభలను, సమావేశాలను ప్రభుత్వం అడ్డుకోవచ్చు కానీ, సెల్‌ఫోన్‌లో వచ్చే సాహిత్యాన్ని, ప్రజావ్యతిరేకతను అడ్డుకోలేదని అన్నారు.

మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకృష్ణ నిర్మించిన 'నమ్మి నానపోస్తే' లఘుచిత్రాన్ని తెలంగాణభవన్‌లో విడుదల చేసి మాట్లాడుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, చిత్రంలో శాసనమండలి ప్రతిపక్ష నేత మధుసూదనాచారి, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తదితరులు

లోకం పోకడ

తెలంగాణ రాష్ట్ర మ్యాపును ఇలా మార్చడం కుదరదు సార్!

తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణకు రండి

కేసీఆర్‌ను ఆహ్వానించిన మంత్రి పొన్నం

హైదరాబాద్, డిసెంబర్ 7 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో 9న జరగనున్న తెలంగాణతల్లి విగ్రహావిష్కరణ కార్యక్రమానికి హాజరు కావాల్సిందిగా ప్రధాన ప్రతిపక్ష నేత, బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్‌ను రాష్ట్ర బీసీ సంక్షేమం, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆహ్వానించారు. శనివారం ఎర్రవెల్లిలోని కేసీఆర్ నివాసానికి వెళ్లిన పొన్నం బృందానికి మాజీ ఎంపీ సంతోష్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి, బీఆర్ఎస్ నేతలు వంశీధర్‌రావు తదితరులు స్వాగతం పలికారు. తన నివాసానికి వచ్చిన మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కేసీఆర్ ఆతిథ్యమిచ్చారు. అందరూ కలిసి భోజనం చేశారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు సందర్భంగా ఢిల్లీ కేంద్రంగా జరిగిన ఉద్యమ జ్ఞాపకాలను ఇరువురు నేతలు నెమరువేసుకున్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ వెంట ప్రభుత్వ ప్రొటోకాల్, ప్రజాసంబంధాల సలహాదారు హర్కర వేణుగోపాల్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ప్రొటోకాల్ డైరెక్టర్ వెంకట్రావు తదితరులున్నారు.

రేపు తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ

లక్షమంది మహిళలు పాల్గొనేలా ఏర్పాట్లు

ఉన్నతాధికారులతో సీఎస్ శాంతికుమారి సమీక్ష

హైదరాబాద్, డిసెంబర్ (నమస్తే తెలంగాణ): సచివాలయం ఆవరణలో తెలంగాణ తల్లి కొత్త విగ్రహావిష్కరణకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్నది. సోమవారం సాయంత్రం 6.05 గంటలకు సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరిస్తారని సీఎస్ శాంతి కుమారి వెల్లడించారు. ఈ మేరకు శనివారం సచివాలయంలో ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. లక్ష మంది మహిళల సమక్షంలో విగ్రహాన్ని ఆవిష్కరించనున్నట్టు ప్రకటించారు. విజయోత్సవాల్లో భాగంగా నేడు నిర్వహించే ఎయిర్ షో, సంగీత విభావరికి ప్రజలు భారీగా హాజరయ్యే అవకాశముందని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను సూచించారు. శనివారం సచివాలయంలో ఎయిర్‌ఫోర్స్ గ్రూప్ కెప్టెన్ అజయ్ దశరథి ఎయిర్ షో జ్ఞాపికను సీఎస్ శాంతికుమారికి అందజేశారు.

రేవంత్‌ది కురచబుద్ధి: శశిధర్‌రెడ్డి

హైదరాబాద్, డిసెంబర్ 7 (నమస్తే తెలంగాణ): తెలంగాణ రాష్ట్రాన్ని ఆగమాగం చేస్తూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కురుచబుద్ధిని ప్రదర్శిస్తున్నారని బీఆర్ఎస్ నేత, మెదక్ మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల శశిధర్‌రెడ్డి ఆరోపించారు. నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీకైన తెలంగాణ తల్లి రూపాన్ని మార్చడం అంటే అమరవీరులు, ఉద్యమకారులకు జరిగిన తీవ్ర అవమానంగానే భావిస్తున్నామని శనివారం ఒక ప్రకటనలో మండిపడ్డారు. చిల్లర చేష్టలతో ఇలాగే రాష్ట్రాన్ని పాలిస్తే చరిత్రహీనుడిగా రేవంత్ మిగిలిపోతారని విమర్శించారు.

తెలంగాణ తల్లిపై హైకోర్టులో పిల్

మొదటిపేజీ తరువాయి...

తీసుకున్న నిర్ణయంపై తెలంగాణ సమాజం మండిపడుతున్నది. కొత్త విగ్రహం రూపురేఖలపై సర్వత్రా వ్యతిరేకత వ్యక్తమవుతున్నా.. ప్రభుత్వం తాను రూపొందించిన నమూనానే ప్రతిష్ఠించేందుకు ముందుకు సాగుతున్నది. దీంతో విగ్రహ ప్రతిష్ఠాపనను ఆపాలని కోరుతూ రాష్ట్ర సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్, బీసీ కమిషన్ మాజీ సభ్యుడు, ప్రముఖ కవి, రచయిత జూలూరు గౌరీశంకర్ సహా పలువురు విగ్రహ హైకోర్టును ఆశ్రయించారు. సోనియాగాంధీ తన జన్మదిన కానుకగా తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించిందని, ఈ నేపథ్యంలో డిసెంబర్ 9న సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్నట్టు ప్రభుత్వం పేర్కొంటున్నది. అయితే, ఈ నూతన విగ్రహం రూపంపై రాష్ట్రవ్యాప్తంగా భిన్నాభిప్రాయాలు వినిపిస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీ, దాని అనుబంధ సంఘాలు, అనుబంధ మేధావులు మినహా తెలంగాణ సమాజం అంతా కొత్త విగ్రహం కాంగ్రెస్ చెయ్యి గుర్తును ప్రచారం చేసేదిగా ఉన్నదని అభిప్రాయపడుతున్నది. 2006 నుంచి తెలంగాణ ప్రజల మదిలో స్థిరపడిపోయిన తల్లిభావనను కాంగ్రెస్ పార్టీ తమకు అనుకూలంగా మలచుకున్నదనే విమర్శలు వినిపిస్తున్నాయి. విగ్రహంలో మార్పును తెలంగాణ అస్తిత్వంపై జరుగుతున్న దాడిగా ప్రజలు, మేధావులు, రచయితలు, కవులు, కళాకారులు అభివర్ణిస్తున్నారు. 'నా కోటి రతనాల వీణ' అని మహాకవి దాశరథి అన్నట్టుగానే ఉద్యమకాలంలో నాడు తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నేతృత్వంలో అనేకమంది మేధావులు, బుద్ధిజీవులు, తెలంగాణ ఆత్మబంధువుల సమక్షంలో తెలంగాణ తల్లిరూపుదిద్దుకున్నది. కేసీఆర్ మీద రాజకీయ కక్షతో తెలంగాణ మీద వీసమెత్తు కూడా అవగాహన, సోయిలేని వ్యక్తి నేడు దానిని మార్చేందుకు కుట్రలు చేస్తున్నాడని పరోక్షంగా రేవంత్‌రెడ్డిపై తెలంగాణ సమాజం మండిపడుతున్నది.

నర్సంపేటలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న, బీఆర్ఎస్ నాయకులు తెలంగాణవాదులు

'తెలంగాణ తల్లి' మార్పు కుట్రే

- రూపురేఖలు మార్చడాన్ని ఒప్పకోం: పెద్ది సుదర్శన్‌రెడ్డి
- రాష్ట్ర ప్రభుత్వ తీరును నిరసిస్తూ నర్సంపేటలో భారీ ర్యాలీ

నర్సంపేట,డిసెంబర్ 7 : తెలంగాణ తల్లివిగ్రహాల రూపు మార్చడం రాష్ట్ర సీఎం రేవంత్ కట్రనేనని బీఆర్ఎస్ నాయకుడు, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ఆరోపించారు. శనివారం నర్సంపేటలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని మార్చుతున్న కాంగ్రెస్ విధానాలను నిరసిస్తూ భారీ ర్యాలీ నిర్వహించి, తెలంగాణ తల్లి, అంబేద్కర్ విగ్రహాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ తల్లి రూపం మార్చే కుట్రలను తిప్పి కొట్టాలని ప్రజలకు పిలుపునిచ్చారు. తెలంగాణ తల్లి ప్రతిరూపాన్ని భవిష్యత్ తరాలకు స్ఫూర్తిగా అందించేలా ఉండాలని సూచించారు. తెలంగాణ తల్లి విగ్రహాన్ని మార్చడం కోసం సెక్యూరిటీని, కాన్వాయ్‌ని వదిలేసి దొంగచాటుగా పెద్ద అంబర్‌పేటకు వెళ్లిన గజదొంగ ముఖ్యమంత్రి రేవంత్ అని ధ్వజమెత్తారు. తెలంగాణ తల్లి విగ్రహాలు ఊరూరా ఇప్పటికే వెలిశాయని గుర్తు చేశారు. కుల, మహిళాసంఘాలు, ప్రజలు స్వచ్ఛంగంగా ప్రతి సెంటర్‌లో తెలంగాణ తల్లి విగ్రహాలను ఏర్పాటు చేసుకున్నారని చెప్పారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు నేపథ్యంలో ప్రతిచోటా ఆ తల్లిని కొలుచుకున్నామని గుర్తు చేశారు. నర్సంపేటలో 40, రాష్ట్రవ్యాప్తంగా 6500 సెంటర్లలో తెలంగాణ తల్లి విగ్రహాలు ఉన్నాయని వెల్లడించారు. రాజ్యాంగ స్ఫూర్తితోనే బీఆర్ అంబేద్కర్ పేరును కేసీఆర్ సెక్రటేరియట్‌కు పెట్టారని తెలిపారు. సీఎం రేవంత్ బీఆర్ అంబేద్కర్ వర్ధంతి నిర్వహించకుండా ఆయనను అవమానించారని, టీఎస్‌ను టీజీగా మార్చి తెలంగాణ ఆత్మాభిమానాన్ని దెబ్బతీశారని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో 420 హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చాక అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు.

'ఇద్దరే' సంతానం చట్టాన్ని తొలగించాలి

దీనిపై అసెంబ్లీలో మాట్లాడాలని కేటీఆర్‌కు గాంధీనాయక్ వినతి

హైదరాబాద్, డిసెంబర్ 7 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఎక్కువ సంతానం కలిగిన వ్యక్తులకు కూడా స్థానిక సంస్థల్లో పోటీ చేసే అర్హత కల్పించాలని జీసీసీ మాజీ చైర్మన్, టీఎస్ స్థానిక సంస్థల ఎన్నికల చట్టం-1995ను రద్దు చేయాలనే డిమాండ్‌తో ఏర్పాటైన ఉద్యమ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు అభిమాన్ గాంధీనాయ్ దరావత్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దేశంలో ఎక్కడా లేని విధంగా 1995లో నాటి ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గ్రామీణ స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇద్దరి కంటే ఎక్కువ మంది సంతానం కలిగిన వ్యక్తులు పోటీ చేసేందుకు అనర్హులనే చట్టాన్ని తీసుకొచ్చారని గుర్తుచేశారు. ఏపీలో ఇప్పుడు ఆ చట్టాన్ని అదే చంద్రబాబు తొలగించారని, తెలంగాణలో కూడా తొలగించాలని విజ్ఞప్తిచేశారు. ఈ చట్టం తొలగింపు అంశంపై సోమవారం నుంచి మొదలయ్యే అసెంబ్లీ సమావేశాల్లో మాట్లాడాలని కోరుతూ శనివారం ఆయన తెలంగాణభవన్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు.

చెక్కులు సరే.. బంగారం ఏది?

- మహిళలకు రూ.2,500 ఎప్పుడిస్తారు?
- కేసీఆర్ కిట్ ఎందుకు ఇవ్వడం లేదు?
- కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీలో మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి

బడంగ్‌పేట, డిసెంబర్ 7: ప్రతి ఆడబిడ్డకు కాంగ్రెస్ ప్రభుత్వం తులం బంగారం బాకీ ఉన్నదని మాజీ మంత్రి పీ సబితాఇంద్రారెడ్డి అన్నారు. బడంగ్‌పేట తాసీల్దార్ కార్యాలయంలో శనివారం కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్‌కు సంబంధించిన 113 చెక్కులను ఆమె లబ్ధిదారులకు అందజేశారు. తాసీల్దార్ ఇంద్రాదేవి ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కు తీసుకున్న ప్రతి ఆడబిడ్డకు ప్రభుత్వం తులం బంగారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. చెక్కులు ఇచ్చి చేతులు దులుపుకుంటామంటే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఎన్నికలలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చాలని అన్నారు. ప్రజల కోసం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ఏ ప్రభుత్వమైనా అమలు చేయవలసిందే అన్నారు. మహిళలకు ఉచిత బస్సుతోపాటు రూ.2,500లు ఇస్తామన్న ప్రభుత్వం ఎందుకు ఇవ్వడం లేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఆడబిడ్డలు బిందెలు తీసుకొని రోడ్ల మీదకు రావద్దని మిషనర్ భగీరథ పథకం కింద ప్రతి ఇంటికి మంచినీరు సరఫరా చేసిన ఘనత మాజీ సీఎం కేసీఆర్‌కే దక్కిందని కొనియాడారు. ముందు చూపుతో కేసీఆర్ అనేక పథకాలు తీసుకొచ్చారని గుర్తుచేశారు.

కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలు దేశంలో ఎక్కడా లేవు

బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలు దేశంలో ఎక్కడా లేవని సబితా ఇంద్రారెడ్డి చెప్పారు. చాలామంది పేదలు తమ బిడ్డల వివాహాలు చేయలేక పడుతున్న ఇబ్బందులను గమనించిన కేసీఆర్ కల్యాణలక్ష్మి లాంటి పథకాలు తెచ్చారని తెలిపారు. ఆడ బిడ్డలకు మేనమామగా కేసీఆర్ ముందుండి పెండ్లిళ్లు జరిపించారని అన్నారు. మహిళల కోసం కేసీఆర్ ప్రతిష్ఠాత్మకంగా తీసుకొచ్చిన కేసీఆర్ కిట్ ఏమైయిందని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కేసీఆర్ కిట్ ఎందుకు ఇవ్వడం లేదో చెప్పాలని అన్నారు. కార్యక్రమంలో మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి, మీర్‌పేట మేయర్ దుర్గా దీప్‌లాల్ చౌహాన్, డిప్యూటీ మేయర్లు ఇబ్రాం శేఖర్, తీగల విక్రంరెడ్డి, బడంగ్‌పేట కమిషనర్ సరస్వతి, మీర్‌పేట కమిషనర్ ఆర్ జ్ఞానేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణభవన్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిసిన తాజా, మాజీ సర్పంచుల సంఘం నాయకులు

రేపు మాజీ సర్పంచుల 'చలో అసెంబ్లీ'

- పెండింగ్ బిల్లులు చెల్లించకుండా మోసం
- సర్పంచుల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు యాదయ్యగౌడ్

హైదరాబాద్, డిసెంబర్ 7 (నమస్తేతెలంగాణ): పంచాయతీల పెండింగ్ బిల్లులు చెల్లించాలనే ప్రధాన డిమాండ్‌తో ఈ నెల 9న 'చలో అసెంబ్లీ' కార్యక్రమాన్ని చేపట్టనున్నట్టు సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్యగౌడ్ తెలిపారు. హైదరాబాద్ గన్‌పార్క్ వద్ద శనివారం చలో అసెంబ్లీ పోస్టర్లను సర్పంచుల జేఏసీ నాయకులు పరదర్శించారు. అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించి, వినతిపత్రం అందజేసి నిరసన తెలిపారు. అనంతరం యాదయ్యగౌడ్ మాట్లాడుతూ అధికారంలోకి రాగానే పెండింగ్ బిల్లులు చెల్లిస్తామని చెప్పిన కాంగ్రెస్.. ఇప్పుడు మోసం చేస్తున్నదని మండిపడ్డారు. సీఎంకు, మంత్రులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడంలేదని విమర్శించారు. గత్యంతరంలేక చలో అసెంబ్లీకి పిలుపునిచ్చామని చెప్పారు. రాష్ట్రంలోని అన్ని గ్రామాల నుంచి తాజా మాజీ సర్పంచులు పెద్దసంఖ్యలో తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచుల జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాంపాక నాగయ్య, ఉపాధ్యక్షుడు గంటి మధుసూదన్‌రెడ్డి, సహాయ కార్యదర్శి కేశబోయిన మల్లయ్య, జూకంటి బాలస్వామి, బీరప్ప పాల్గొన్నారు.

అసెంబ్లీలో మాజీ సర్పంచ్‌ల సమస్యలు ప్రస్తావిస్తా : కేటీఆర్

హైదరాబాద్, డిసెంబర్7 (నమస్తే తెలంగాణ): అసెంబ్లీ సమావేశాల్లో మాజీ సర్పంచ్‌ల సమస్యలను ప్రస్తావిస్తానని మాజీ మంత్రి కేటీఆర్ హామీ ఇచ్చారు. అధికారంలోకి రాగానే పెండింగ్ బిల్లులు చెల్లిస్తామని కాంగ్రెస్ ఇచ్చిన హామీని నెరవేర్చాలని డిమాండ్ చేస్తామని చెప్పారు. శనివారం కేటీఆర్‌ను హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన మాజీ సర్పంచ్‌లు కలిశారు. ఈ సందర్భంగా సమస్యలపై గోడు వెళ్లబోసుకున్నారు. పెండింగ్ బిల్లులు చెల్లింపులో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తున్నదని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యమంత్రి, మంత్రులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడంలేదని ఆవేదనవ్యక్తం చేశారు. అప్పుల భారం పెరిగిపోవడంతో గ్రామాల్లో తలెత్తుకోలేకపోతున్నామని ఏకరువు పెట్టారు. వారి సమస్యలపై కేటీఆర్ సానుకూలంగా స్పందించారు.

కేటీఆర్‌తో జడ్సన్ భేటీ

కాంగ్రెస్ బహిష్కృత నాయకుడు బక్క జడ్సన్ శనివారం మాజీ మంత్రి కేటీఆర్‌ను ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా హైడ్రా బాధితులు ఎదుర్కొంటున్న సమస్యలు, వారికిచ్చే పరిహారంపై అసెంబ్లీలో ప్రస్తావించాలని కోరారు. ఇందుకు కేటీఆర్ సైతం సానుకూలంగా స్పందించారు.

పోస్టర్ ఆవిష్కరిస్తున్న రాజేశ్ నాయక్, సత్యనారాయణ, శ్రీనాథ్, ప్రకాశ్ తదితరులు

మంత్రిత్వశాఖే లేని సంక్షేమం ఎలా సాధ్యం?

- నంగారాభేరి, ఎల్‌హెచ్‌పీఎస్ అధ్యక్షుడు రాజేశ్‌నాయక్
- జనవరి 30న జరిగే 'గిరిజన గర్జన' పోస్టర్ ఆవిష్కరణ

ఖైరతాబాద్, డిసెంబర్ 7 : రాష్ట్రంలో మంత్రిత్వ